


యార్డుకు 1,63,393 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మిర్చి యార్డుకు సోమవారం 1,63,393 బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,43,296 బస్తాల అమ్మకాలు జరిగాయి.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 537.80 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు పదివేల క్యూసెక్కులు విడుదలవుతోంది.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



తెనాలి టౌన్: కొలకలూరులోని పంచముఖ గాయత్రీదేవి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం చండీ హోమం, శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

న్యూస్‌రీల్

తెలుగులో తీర్పు చెప్పిన న్యాయమూర్తి

తెనాలి రూరల్: తెనాలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) కోర్టులో ఓ కేసు(686/23)కు సంబంధించిన తీర్పును న్యాయమూర్తి తెలుగులో చెప్పారు.ప్రోనోటుకు సంబంధించిన కేసులో న్యాయమూర్తి తీర్పును తెలుగులో వెలువరించారని, రానున్న వారం రోజులు తెలుగులోనే చెప్పనున్నారని కోర్టు వర్గాలు తెలిపాయి.

21న కుంభమేళాకు ప్రత్యేక బస్సు

పట్నంబజారు: భక్తుల కోరిక మేరకు కుంభమేళాకు మరో స్పెషల్ హైటెక్ బస్సును ఈనెల 21వ తేదీన ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం ఎం. రవికాంత్ తెలిపారు. మొత్తం ఎనిమిది రోజుల ప్రయాణం ఉంటుందని పేర్కొన్నారు. 21వ తేదీ ఉదయం 10 గంటలకు బస్సు బయలుదేరి ప్రయాగ్‌రాజ్ చేరుకున్న అనంతరం అక్కడ నుంచి అయోధ్య, వారణాసి వెళ్లి తిరిగి వస్తుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో 91927 సర్వీస్ నంబర్ ద్వారా టికెట్ బుక్ చేసుకోవాలని సూచించారు. ఒక్కో టికెట్ ధర రూ. 8,300గా నిర్ణయించినట్లు తెలిపారు. భోజనాలు, వసతి ఖర్చుల బాధ్యత ప్రయాణికులదేనని చెప్పారు. వివరాల కోసం 7382897459, 7382896403 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

రేపు వాహనాల వేలం పాట రద్దు

పట్నంబజారు: రవాణా శాఖకు పన్నులు చెల్లించకుండా నిర్బంధంలో ఉన్న వాహనాలకు ఈ నెల 19న నిర్వహించ తలపెట్టిన బహిరంగ వేలం పాటను రద్దు చేసినట్లు డీటీసీ కె. సీతారామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు ఆర్టీఏ కార్యాలయంలో ఉన్న 31 వాహనాల వేలాన్ని పలు శాఖాపరమైన కారణాలతో నిలిపి వేసినట్లు పేర్కొన్నారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై సమీక్ష



నరసరావుపేట టౌన్: మార్చి 8న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి సోమవారం స్థానిక న్యాయస్థాన భవనాల ఆవరణలో పోలీసు అధికారులతో న్యాయమూర్తులు సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మార్చి 8న స్థానిక న్యాయస్థానం భవనాలు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు స్థానిక అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.మధుస్వామి తెలిపారు. ఈ సందర్భంగా అదాలత్‌లో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీసు అధికారులకు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవడానికి చట్టపరమైన అంశాలను వివరించారు. పోలీసులు కేసులు పరిష్కారానికి సంబంధించి లేవనెత్తిన పలు సందేహాలను నివృత్తి చేశారు. న్యాయమూర్తి ఆర్.ఆశీర్వాదం పాల్, వన్‌టౌన్ ఎస్ఐ అరుణ, టూటౌన్ ఎస్ఐ లేఖ ప్రియాంక, రొంపిచర్ల ఎస్ఐ మణి కృష్ణ, నకరికల్లు ఎస్ఐ సిహెచ్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు

త్రికోటేశ్వరునికి బంగారు రుద్రాక్షలు బహూకరణ



నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారికి నాదెండ్ల మండలం కమ్మవారిపాలెంకు చెందిన భక్తుడు చంద్ర శ్రీనివాసరావు రూ.16లక్షల విలువైన బంగారు రుద్రాక్షలను బహూకరించాడు. ఆలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదుగా బంగారు రుద్రాక్షలను ఆలయ అర్చకులకు అందజేశారు. ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొన్నారు.

పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

నరసరావుపేట రూరల్: తిరునాళ్ల ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారిని సోమవారం ఎమ్మెల్యేలు పత్తిపాటి పుల్లారావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలిసి ఆయన దర్శించుకున్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

కూలీల ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



ప్రమాదానికి కారణమైన బస్సు

పొట్ట కూటి కోసం వేకువజామునే బయలుదేరిన పేద బతుకులపై విధి కన్నెర్ర చేసింది. సూర్యోదయం చూడకుండానే ఆ పేద జీవితాలు అస్తమించాయి. మినుము కోత పనులకు ఆటోలో వెళ్తున్న మహిళలపైకి బస్సు మృత్యు రూపంలో దూసుకొచ్చింది. ముగ్గురిని పొట్టన పెట్టుకుంది. అప్పటివరకు సాగిన ముచ్చట్లు ఒక్కసారిగా హాహాకారాలుగా మారాయి. ఆర్తనాదాలై మారుమోగాయి. సంఘటన రహదారి ప్రాంతమంతా రక్తసిక్తమై భయానకంగా మారింది. విషయం తెలిసి గుండెలు బాదుకుంటూ వచ్చిన బంధువుల రోదనలు మిన్నంటాయి. ఈ హృదయ విదారక ఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు సమీపంలో సోమవారం జరిగింది.

- నారాకోడూరు వద్ద ప్రమాదంలో ముగ్గురు మహిళలు మృతి
- తొమ్మిది మందికి గాయాలు
- ప్రమాదానికి పొగ మంచే కారణం

చేబ్రోలు: మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన 12 మంది వ్యవసాయ కూలీలు సోమవారం వేకువజామునే నీరుకొండ ప్రాంతానికి మినుము కోత పనులకు ఆటోలో పయనమయ్యారు. దారంతా దట్టమైన పొగ మంచు కమ్మింది. నారాకోడూరు – బుడంపాడు గ్రామాల మధ్యకు వచ్చేసరికి గుంటూరు– 2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కూలీల ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అల్లంశెట్టి అరుణకుమారి (39), కుర్రా నాంచారమ్మ (40), తోట సీతారావమ్మ (41) అక్కడికక్కడే మరణించారు. వీరితోపాటు ఎం. శివమ్మ, ఎం. శివపార్వతి, జి. మల్లేశ్వరి, ఏ. వెంకట ప్రవీణ, ఆర్. రత్నకుమారిలతో పాటు ఆటో డ్రైవర్ ఇబ్రహీంతో పాటు మరో ముగ్గురుకు గాయాలయ్యాయి. వీరంతా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. మృతి చెందిన ముగ్గురు మహిళల మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం పోలీసులు కుటుంబ సభ్యులకు అందజేశారు.

రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలు

ప్రమాదంలో మరణించిన ముగ్గురు కుటుంబాలది రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి. సుద్దపల్లి గ్రామంలోని యూపీ స్కూల్ సమీపంలో నివసిస్తున్న వీరంతా ఊరిలో వ్యవసాయ పనులు లేకపోవడంతో సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న నీరుకొండ పరిసర ప్రాంతాలకు కొద్ది రోజులుగా వెళుతున్నారు. రోజు మాదిరిగానే సోమవారం తెల్లవారుజామున ఆటోలో 12 మంది మహిళలు పనులకు బయలుదేరారు. పనులకు వెళ్లొస్తామంటూ చిరునవ్వుతో ఇంట్లోంచి బయలుదేరి వెళ్లిన వీరంతా కొద్దిసేపటికి ప్రమాద ఘటనా స్థలంలో విగత జీవులుగా మారడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.

ప్రమాదంలో మృతి చెందిన మహిళలు



భయానక వాతావరణం

ప్రమాద సంఘటనలో ఆటో నుజ్జునుజ్జుగా మారి బోల్తా పడింది. ఆర్టీసీ బస్సు ముందు భాగం దెబ్బతింది. ప్రమాద స్థలంలో భయానక వాతావరణం నెలకొంది. ప్రమాదంతో పొన్నూరు, గుంటూరు రోడ్డుకు ఇరువైపులా కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. చేబ్రోలు పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకొని క్రమబద్ధీకరించారు. పొన్నూరు రూరల్ సీఐ వై. కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్ఐ డి. వెంకటకృష్ణ సంఘటన ప్రాంతానికి చేరుకొని ప్రమాద వివరాలను నమోదు చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జుగా మారి బోల్తా పడిన ఆటో

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

రూ.2.40 లక్షల విలువైన 24 కిలోల గంజాయి పట్టివేత



నగరంపాలెం: ఇద్దరు గంజాయి విక్రేతలను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాలులో సోమవారం ట్రైనీ ఐపీఎస్ దీక్ష, జిల్లా ఏఎస్పీ కె. సుప్రజ (క్రైం)తో కలిసి కేసు వివరాలను ఆయన తెలిపారు. గుంటూరు రూరల్ మండలం శివారెడ్డిపాలెం పోలేరమ్మ గుడి సమీపాన ఉంటున్న దమ్మాలపాటి మణికంఠ ఏడో తరగతి వరకు చదివాడు. చెడు అలవాట్లకు బానిసయ్యాడు. బేల్దారి పనులతో పాటు ట్రాక్టర్ డ్రైవర్‌గా వెళ్లేవాడు. గతేడాదిలో వైజాగ్ వెళ్లి, తిరుగు ప్రయాణంలో తునిలో దిగి, గంజాయి ఎక్కడ విక్రయిస్తారని వాకబు చేశాడు. అనంతరం విశాఖపట్నం జి.మడుగు మండలం పెద్ద కిల్తారికి చెందిన చింతల సత్యనారాయణ అలియాస్ సతీష్‌తో పరిచయమైంది. దీంతో రూ.10 వేలకు రెండు కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. అక్కడ నుంచి ప్రతిసారి బస్‌లో వెళ్లి, రైళ్ల ద్వారా గుంటూరుకు గంజాయి తెచ్చాడు. యాభై గ్రాములు సంచులను రూ.500కు విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. ఈ క్రమంలో రెండు రోజుల కిందట చింతల సత్యనారాయణకు ఫోన్ చేసి భారీగా గంజాయి కావాలని అడిగాడు. దీంతో సత్యనారాయణ భార్య చింతల పద్మ 24 కిలోల గంజాయిని సోమవారం మణికంఠ నివాసానికి తీసుకువచ్చింది. ముందస్తు సమాచారంతో మణికంఠను, చింతల పద్మను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.2.40 లక్షల ఖరీదు చేసే 24 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న సతీష్‌ను త్వరలో పట్టుకుంటామని జిల్లా ఎస్పీ తెలిపారు.

కమిషనర్ నోట ధూళిపాళ్ల మాట

- కోర్టులో ఉన్న గ్రీన్ గ్రేస్‌పై కమిషనర్ వివాదాస్పద వ్యాఖ్యలు
- ప్లాన్ ఉన్నా అది ఇల్లీగల్ అంటూ వాఖ్య
- అన్ని షార్ట్ ఫాల్స్‌ను అధిగమించిన గ్రీన్ గ్రేస్ యాజమాన్యం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు వ్యవహార శైలి మరోసారి వివాదాస్పదంగా మారింది. ఒక అపార్టుమెంట్ కోసం ప్రెస్‌మీట్ పెట్టడం, గతంలో పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ఏం మాట్లాడారో వాటినే వల్లె వేయడం ఆశ్చర్యం కలిగించింది. గత ఎన్నికల్లో పొన్నూరు నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేసిన అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్మాణంలో ఉన్న గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్‌పై కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నరేంద్ర ఆరోపణలు చేశారు. అనుమతులు లేకుండా కడుతున్నారంటూ, దాన్ని అడ్డుకోవాలంటూ విలేకరుల సమావేశాలు పెట్టారు. అప్పటి నుంచి మున్సిపల్ అధికారులు గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్ నిర్మాణాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నాలు మొదలు పెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత షార్ట్ ఫాల్ నోటీసులు ఇచ్చారు. అయితే, దీనికి సంబంధించిన అన్ని అనుమతులను సంస్థ మున్సిపల్ కార్పొరేషన్‌కు అందజేసింది. ఫైర్ ఎన్ఓసీ, ఎన్విరాన్‌మెంటల్ ఎన్‌వోసీతో పాటు అన్ని అనుమతులు, ఫీజులు ఎప్పటికప్పుడు చెల్లించి అప్‌డేట్‌గా ఉన్నారు.



గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంటులో అధికారుల తనిఖీలు

కమిషనర్ వెనుక అదృశ్య శక్తులు?

రైల్వే ఎన్‌వోసీ విషయానికి వస్తే కార్పొరేషన్ నిబంధనల ప్రకారం 13 మీటర్లు సరిపోతుంది. అయితే రైల్వే 14 మీటర్లు ఉండాలనడంతో గ్రీన్ గ్రేస్ యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై నిర్ణయం వెలువడేవరకు ఎటువంటి చర్యలు తీసుకోరాదని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఇదే కాకుండా మరో రెండు రిట్ పిటిషన్లు ఇదే అంశంపై కోర్టులో ఉన్నాయి. ఇవన్నీ ఉండగానే కార్పొరేషన్ అధికారుల బృందం సోమవారం గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్‌లలో తనిఖీలు చేసింది. అనంతరం మున్సిపల్ కమిషనర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మరీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కోర్టులో ఒక అంశం ఉండగా దానికి సంబంధించి ఎవరూ కొనుగోలు చేయవద్దంటూ ఉచిత సలహాలు ఇవ్వడం, అధికారికంగా ప్లాన్ ఉన్నా అది ఇల్లీగల్ అంటూ వ్యాఖ్యానించడం చర్చనీయాంశంగా మారింది. అన్ని షార్ట్‌ఫాల్స్‌ను అధిగమించిన తర్వాత కూడా దానికి అసలు ప్లానే లేదని కమిషనర్ చెప్పడం వెనుక ఎవరు ఉన్నారన్న ప్రశ్న ఉత్పన్నం అవుతోంది.

షార్ట్ ఫాల్‌లో 1,187 భవనాలు

గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 1187 భవనాలు షార్ట్ ఫాల్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఇందులో రాజకీయ పలుకుబడి ఉన్నవారు, అధికార పార్టీకి చెందిన వారిని పక్కన పెట్టి మిగిలిన వారిలో తమకు ఉపయోగపడే వారిని గుర్తించి వారికి నోటీసులు ఇచ్చారు. వీరి నుంచి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. వీటిలో ఏ ఒక్క భవనం పనులు కూడా నిలిపి వేయలేదు. గుంటూరు నగరంలోనే ఈ 1187 భవనాల నుంచి రూ. 150 నుంచి రూ. 200 కోట్ల వరకూ టౌన్ ప్లానింగ్ సిబ్బంది వసూలు చేసి ఉంటారని ఒక అంచనా. ఇంత అవినీతి జరిగితే చర్యలు తీసుకోకుండా 1187లో ఒకటైన గ్రీన్ గ్రేస్‌పై కమిటీ వేయడం, నివేదిక రాకముందే కమిషనర్ మీడియా ముందుకు రావడం, అక్కడ ప్లాట్లు కొనుగోలు చేయవద్దని సలహాలు ఇవ్వడం చూస్తుంటే మొత్తం ఈ వ్యవహారం రాజకీయ రంగు పులుముకున్నట్లు అర్థం అవుతోంది.

అదనపు కమిషనర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు

గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్ నిర్మాణ పనుల నిలిపివేత ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ తదుపరి పనులు చేయడం, పట్టణ ప్రణాళిక అధికారుల పర్యవేక్షణ లోపం తదితర అంశాలపై అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి అధికారుల కమిటీ ఏర్పాటు చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్దేశిత అనుమతులు లేకుండా కేవలం డీమ్డ్ ప్లాన్‌తో నిర్మాణ పనులు చేట్టిందని తెలిపారు. గత ఏడాది తాము కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్న డాక్యుమెంట్స్‌ను పరిశీలించిన తరువాత ప్రభుత్వానికి 19 మంది అధికారుల పాత్రపై సమగ్ర నివేదిక పంపామని చెప్పారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్ సీహెచ్. శ్రీనివాసరావు, సిటీప్లానర్ రాంబాబు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో జలగలు

- బ్లడ్ బ్యాంక్‌లో వెలుగులోకి వస్తున్న అక్రమాలు
- అమ్మిన రక్తం డబ్బులను ఇష్టానుసారంగా వాడేస్తున్న సిబ్బంది
- జీజీహెచ్ పరువు మంట గలుపుతున్న బ్లడ్ బ్యాంక్ సిబ్బంది
- అభివృద్ధి కమిటీకి నిధులు జమ చేయడం లేదు

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో కళ్ల ముందే రక్తంతో సిబ్బంది వ్యాపారం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రైవేటు బ్లడ్ బ్యాంక్‌ల వారికి రక్తం, ప్లాస్మాను నిస్సిగ్గుగా అమ్ముకుంటున్నారు. నాలుగు రోజుల కిందట నాలుగేళ్ల బాలుడు తీవ్రంగా కాలిన గాయాలతో చికిత్స కోసం జీజీహెచ్‌కు వచ్చాడు. డాక్టర్ల సూచనల మేరకు అతడికి ప్లాస్మా కావాలని కుటుంబ సభ్యులు బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లారు. ఎవరైనా రక్తాన్ని ఇస్తేనే ప్లాస్మా ఇస్తామని సిబ్బంది కరాఖండిగా చెప్పారు. రక్తదానం చేసేందుకు బంధువులు లేకపోవడంతో వారు జీజీహెచ్ నుంచి ప్లాస్మాను ఉచితంగా తీసుకోలేకపోయారు. దీంతో బాలుడు చనిపోయాడు. ప్లాస్మా తమకు అందించకపోవడం వల్లే ఇన్‌ఫెక్షన్ ఎక్కువై చనిపోయాడంటూ జిల్లాకు చెందిన ఓ మంత్రికి బాలుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

ప్రైవేటు బ్లడ్ బ్యాంకులకు అమ్మకం

జీజీహెచ్‌లో రోగులకు ఉచితంగా రక్తం ప్లాస్మా ఇవ్వాలి. అయితే, బ్లడ్ బ్యాంకు అధికారులు తమ వద్ద అధిక మొత్తంలో బ్లడ్, ప్లాస్మా ఉందని, దాన్ని వినియోగించకపోతే పాడవుతుందని చెబుతూ ప్రైవేటు బ్లడ్ బ్యాంక్‌లకు అమ్ముతున్నారు. ఈ విధంగా వచ్చిన నిధుల్ని నిబంధనల ప్రకారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ (హెచ్‌డీఎస్) అకౌంట్‌కు జమ చేయాలి. అయితే, బ్లడ్ బ్యాంక్‌లో ఇవేమి జరగడం లేదు. సిబ్బంది తమ అకౌంట్లలో జమ చేసుకుని ఇష్టానుసారంగా ఖర్చు పెడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



గుంటూరు జీజీహెచ్‌లోని రక్తనిధి

విచారించి చర్యలు తీసుకుంటాం

గుంటూరు జీజీహెచ్‌లో బ్లడ్ అమ్మకాల గురించి నా దృష్టికి రాలేదు. ఆరోపణలపై విచారించి చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ రమణ యశస్వి
ఆసుపత్రి సూపరింటెండెంట్

దాతల విరాళాలు మాయం

జీజీహెచ్‌లో రక్తపు బ్యాగులు నిల్వ చేసేందుకు గతంలో ఇద్దరు దాతలు స్టోరేజ్ ఫ్రిజ్‌లను ఇచ్చేందుకు ముందుకొచ్చారు. అయితే, సిబ్బంది తాము తక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తామంటూ డబ్బులు తీసుకుని వాడేసుకున్నారు.

దొంగ బిల్లులతో స్వాహా

జీజీహెచ్‌లో రక్తదానం చేసిన వారికి శక్తి వచ్చేందుకు గ్లూకోజ్ వాటర్, జూస్, బిస్కెట్లు, స్నాక్స్ ఇవ్వాలి. రక్తదాతలకు ఏమీ ఇవ్వకుండానే ఇచ్చినట్లుగా దొంగ బిల్లులు సృష్టించి నిధులు కొల్లగొడుతున్నారు. నిబంధనల ప్రకారం బ్లడ్ బ్యాంక్‌లో పెథాలజిస్టు ఉండాలి. గుంటూరు వైద్య కళాశాలలో ఆ వైద్య విభాగం ఉంది. జీజీహెచ్ బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జిగా పెథాలజిస్ట్ కాకుండా కేవలం సివిల్ అసిస్టెంట్ సర్జన్(సీఏఎస్) ఉండటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

మెడికల్ జిగేల్



చినకాకాని ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలలో మూడు రోజులు పాటు జరిగిన ఇండియన్ సొసైటీ ఆఫ్ పెరినాటాలజీ అండ్ రీ ప్రొడక్ట్ మెడిషన్ (ఇస్పోపార్బ్) 40వ జాతీయ సదస్సు సోమవారం విజయవంతంగా ముగిసింది. ఇస్పోపార్బ్ కొత్త అధ్యక్షురాలిగా డాక్టర్ సులేఖా పాండే బాధ్యతలు స్వీకరించారు. సదస్సును ఇస్పోపార్బ్ విజయవాడ చాప్టర్ నిర్వహించింది. – మంగళగిరి

మూడు రోజులుగా కాల్వలో వృద్ధుడు



తెనాలి రూరల్: మూత్ర విసర్జనకు వెళ్లిన వృద్ధుడు ప్రమాదవశాత్తు కాల్వలో పడ్డాడు. మూడు రోజులుగా చెత్త కుప్పపై ఉంటూ సాయం కోసం ఎదురు చూస్తున్నాడు. చివరకు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో బయటకు తీసి ఇంటికి పంపారు. వివరాలిలా ఉన్నాయి.. పట్టణ మారిస్‌పేటకు చెందిన సుభాని మార్కెట్‌లో తోపుడు బండిపై పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. మూడు రోజుల కిందట తెల్లవారుజామున మూత్ర విసర్జనకు వెళ్లి ప్రమాదవశాత్తు మార్కెట్ వంతెన వద్ద తూర్పు కాల్వలో పడ్డాడు. స్పృహ తప్పిన అతను కొద్ది గంటల అనంతరం తేరుకుని వంతెన కింద ఉన్న చెత్తకుప్ప మీదకు చేరుకున్నాడు. సాయం కోసం కేకలు వేసినా ఎవరికీ వినిపించకపోవడంతో మూడు రోజుల పాటు అక్కడే ఉండి పోయాడు. సోమవారం సాయంత్రం స్థానికులు అతన్ని గుర్తించి మార్కెట్ వంతెన కూడలిలో ట్రాఫిక్ విధుల్లో ఉన్న హోంగార్డులకు సమాచారం తెలిపారు. హోంగార్డులు చెన్నబోయిన నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, పేరయ్యలు తాడు సాయంతో కాల్వలోకి దిగి కాల్వ నుంచి బయటకు తీసుకువచ్చారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **4,200** గరిష్ఠం : రూ. **5,300**

మోడల్ ధర రూ. **4,900**

క్లుప్తంగా

కాజ టోల్ ప్లాజాను రద్దుచేయాలి



మంగళగిరి టౌన్: మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని అధిక టోల్‌ఫీజు వసూలు చేస్తున్న కాజ టోల్‌ప్లాజాను వెంటనే రద్దు చేయాలని ప్రయాణికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ బాల వెంకటరావు, ప్రధాన కార్యదర్శి నన్నపనేని నాగేశ్వరరావు కోరారు. మంగళగిరి నగర పరిధిలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాజ టోల్‌గేట్ వలన అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు 79 కిలోమీటర్ల దూరంలో టోల్‌ప్లాజా ఉండకూడదని దీనిపై లారీ ఓనర్స్ మౌనం ఎందుకు వహిస్తున్నారని ప్రశ్నించారు. గతంలో రూ.150 ఉండే టోల్‌పాస్ ఇప్పుడు రూ.340 చేశారని దీనిపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. గుంటూరు, విజయవాడ మధ్యలో ఉన్న ఈ టోల్‌గేటును తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు.

పసుపు ధరలు

దుగ్గిరాల: పసుపు గరిష్ఠ ధర రూ.9800 పలికింది. దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డుకు సోమవారం 320 బస్తాలు రాగా మొత్తం అమ్మకం జరిగినట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. సరకు కనిష్ఠ ధర రూ.9600, గరిష్ఠ ధర రూ.9800, మోడల్ ధర రూ.9800, కాయ కనిష్ఠ ధర రూ.9,551, గరిష్ఠ ధర రూ.9700, మోడల్ ధర రూ.9700 పలికినట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు మార్గదర్శకాలు తప్పనిసరి

- జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి
- ఎన్నికల అధికారులకు శిక్షణ



మాట్లాడుతున్న ఎస్.నాగలక్ష్మి

లక్ష్మీపురం: ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా కొనసాగేలా ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు ప్రకారం పనిచేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్ల శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉదయం 8 గంటల సమయానికి ఓటింగ్ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే ప్రిసైడింగ్ అధికారి డైరీతో పాటు, ఇతర నాన్ స్టాట్యూటరీ, స్టాట్యూటరీ ఫారాలను సక్రమంగా పూర్తి చేసుకొని, బ్యాలెట్ బాక్స్‌లు సక్రమంగా సీజ్ చేసి రిసెప్షన్ కేంద్రాల్లో అప్పగించాలని ఆదేశించారు. పోలింగ్ విధులు కేటాయించిన ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తులను ఫిబ్రవరి 20వ తేదీ నాటికి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అందేలా పోస్ట్ ద్వారా కాని, స్వయంగా కాని అందించాలని కోరారు. సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ మాట్లాడుతూ ప్రిసైడింగ్ అధికారులు ఇతర పోలింగ్ అధికారులను సమన్వయం చేసుకుంటూ పోలింగ్ మెటీరియల్ తీసుకునేటప్పుడు, పోలింగ్ ప్రక్రియ ప్రారంభానికి అన్ని అంశాలను పూర్తి స్థాయిలో పరిశీలించుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి పాల్గొన్నారు.

పది పరీక్షలు పకడ్బందీ ఏర్పాట్లు

పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో పరీక్షల నిర్వహణపై జిల్లా అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పరీక్షలు మార్చి 17వ తేదీ ప్రారంభమవుతాయని చెప్పారు. రెగ్యులర్ విద్యార్థులు 29,499 మంది, ప్రైవేటు 961 మంది విద్యార్థులు మొత్తం 30,460 మంది విద్యార్థులు 150 పరీక్ష కేంద్రాలలో పరీక్షలకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయన్నారు. జిల్లాలో సమస్యాత్మకంగా గుర్తించిన పరీక్ష కేంద్రాలు వద్ద ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. పరీక్షలలో మాల్ ప్రాక్టీస్, కాపీయింగ్ జరగకుండా విద్యా శాఖ, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు సమన్వయంతో పర్యవేక్షించాలని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి షేక్ ఖాజావలి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ గంగరాజు, డ్వామా పీడీ శంకర్, జిల్లా విద్యా శాఖ అధికారి రేణుక, డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, ఎస్పీ సీఐ శ్రీనివాసరావు, ఎంవీఐ గోపాల్, నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, సీపీడీసీఎల్ డీఈ ప్రసాద్, జిల్లా విద్యా శాఖ అసిస్టెంట్ కమిషనర్ వెంకటరెడ్డి, గుంటూరు పోస్టల్ శాఖ ఇన్ స్పెక్టర్ రవిశేఖర్, తెనాలి అసిస్టెంట్ సూపరింటెండెంట్ పాంచజన్య రెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజరు డి.ఆదినారాయణ పాల్గొన్నారు.

స్వచ్ఛత గ్రీన్ లీఫ్ రేటింగ్ విధానం సక్రమంగా అమలు జరపాలి

పర్యాటక రంగం అభివృద్ధి కోసం అతిథి గృహాల్లో సురక్షితమైన పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపర్చేందుకు ప్రవేశ పెట్టిన స్వచ్ఛత గ్రీన్ లీఫ్ రేటింగ్ విధానంను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం సక్రమంగా అమలు జరిగేలా పటిష్ఠ ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో స్వచ్ఛత గ్రీన్ లీఫ్ రేటింగ్ విధానం(ఎస్ జీ ఎల్ ఆర్ ఎస్) జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహాతో కలసి పాల్గొన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కళ్యాణ చక్రవర్తి, జిల్లా పరిషత్ సీఈఓ జ్యోతిబసు, ఆర్డీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

డాక్టర్ కవితకు అరుదైన అవార్డు



కేంద్ర మంత్రి రామమోహన్ నాయుడు నుంచి అవార్డు అందుకుంటున్న డాక్టర్ కవిత

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి(జీజీహెచ్) గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ ముక్కు కవిత, కేంద్ర మంత్రి కె.రామమోహన్ నాయుడు చేతుల మీదుగా అరుదైన పురస్కారం అందుకున్నారు. టైమ్స్ నెట్‌వర్క్ ఇండియా హెల్త్ కేర్ అవార్డుల పురస్కారం ఆదివారం వైజాగ్‌లో నిర్వహించారు. ఆరోగ్య సంరక్షణ రంగంలో గణనీయమైన కృషి చేసినందుకు మార్గదర్శకులను గుర్తించి అవార్డులను అందజేస్తున్నారు. ఆరోగ్య సంరక్షణ భవిష్యత్‌ను రూపొందించడంలో మెరుగైన పాత్ర వహించి గణనీయమైన కృషి చేసినందుకు డాక్టర్ కవితకు అవార్డు లభించింది. అవార్డు అందుకున్న డాక్టర్ కవితకు గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి. సుందరాచారీ, వైద్య కళాశాల, జీజీహెచ్‌కు చెందిన పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది సోమవారం అభినందనలు తెలిపారు.

ఇస్పోపార్బ్ అధ్యక్షురాలిగా డాక్టర్ సులేఖా పాండే



జ్ఞాపికలు బహూకరిస్తున్న డాక్టర్ గీతాదేవి

మంగళగిరి: ఇండియన్ సొసైటీ ఆఫ్ పెరినాటాలజీ అండ్ రీ ప్రొడక్ట్ మెడిసన్(ఇస్పోపార్బ్) కొత్త అధ్యక్షురాలిగా డాక్టర్ సులేఖా పాండే బాధ్యతలు స్వీకరించారు. నగర పరిధిలోని చినకాకాని ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలలో మూడు రోజులు పాటు నిర్వహించిన ఇస్పోపార్బ్ 40వ జాతీయ సదస్సు సోమవారం ముగిసింది. మూడు రోజులు పాటు నిర్వహించిన సదస్సులో పెరినాటాలజీ, రీ ప్రొడక్ట్ మెడిషన్‌లోని కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. సదస్సును ఇస్పోపార్బ్ విజయవాడ చాప్టర్ నిర్వహించింది. ప్రారంభోత్సవానికి ఇస్పోపార్బ్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నారాయణ జానా, కార్యదర్శి డాక్టర్ మిశ్రా చౌదరి, ఎన్టీఆర్‌యూహెచ్‌ఎస్ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి హాజరై అనేక అంశాలను చర్చించారు. చాప్టర్ అధ్యక్షురాలు డాక్టర్ కె.గీతాదేవి, కార్యదర్శి కె.లత ప్రాతినిధ్యం వహించగా 450 మంది ప్రతినిధులు హాజరైన కార్యక్రమంలో పెరినాటాలజీ, రీ ప్రొడక్ట్ మెడిషన్‌లోని పలు అంశాలను చర్చించారు. కార్యక్రమంలో పోషకురాలు డాక్టర్ ఆర్ఎస్ రమాదేవి, ఏపీఎంసీ పరిశీలకులు డాక్టర్ కె.ప్రభాదేవి, ఓబీజీ విభాగం హెచ్ఓడీ డాక్టర్ కె.గంగాధరరావు, సైంటిఫిక్ చైర్ డాక్టర్ వి.పద్మజ, విజయవాడ ఓబీజీ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ వి.శ్రీదేవి పాల్గొన్నారు.

విద్యుత్ నెట్ వర్క్‌లో ఏఐ ఆధారిత పరిష్కారాలపై సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ రామ్మోహన్ మలిపెద్ది

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఎనర్జీ డిస్‌ఎగ్రిగేషన్ ఏఐ బేస్డ్ సొల్యూషన్ మెథడ్స్ అండ్ అప్లికేషన్స్ అంశంపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యవక్తగా సౌత్ కొరియా నేషనల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ రామ్మోహన్ మల్లిపెద్ది హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎనర్జీ డిస్‌ఎగ్రిగేషన్ పద్ధతి అంటే కరెంట్ మీటర్ నుంచి కరెంటు పరికరాల శక్తి వినియోగాన్ని వేరు చేసే ఓ టెక్నిక్ అని తెలిపారు. శక్తి వినియోగంలో ఆధునాతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి ఉపకరణాల వినియోగాన్ని పూర్తిస్థాయిలో విశ్లేషించవచ్చని దాని ద్వారా ఉపకరణాల పనితీరును మెరుగుపరుచుకోవడం శక్తి వినియోగాన్ని తగ్గించుకోవడం చేయవచ్చన్నారు. ఉపకరణాల వినియోగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం ద్వారా పనితీరుకు సరిపడా శక్తిని అందించబడుతుందని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఏవీ సరేష్ బాబు, డాక్టర్ సీహెచ్ నాగసాయి కళ్యాణ్ పాల్గొన్నారు.

రీసర్వే పైలెట్ ప్రాజెక్ట్ పనులు తనిఖీ



లక్ష్మీపురం: గుంటూరు తూర్పు మండలం, జొన్నలగడ్డ గ్రామంలో భూ రీసర్వే పైలెట్ ప్రాజెక్ట్ కింద చేపట్టిన పనులను జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ సోమవారం తనిఖీ చేశారు. రీ సర్వే బ్లాక్ బౌండరీ సరిహద్దులను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

నీతి ఆయోగ్ బృందం తక్కెళ్లపాడు సందర్శన



పెదకాకాని: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల సద్వినియోగంపై నీతి ఆయోగ్ ప్రతినిధుల బృందం తక్కెళ్లపాడు పంచాయతీ కార్యాలయాన్ని సోమవారం సందర్శించింది. బృందం సభ్యులు జిష్ణుపాల్, స్వప్నలు ప్రధానమంత్రి ఆవాస్ యోజన, సడక్ యోజన, పింఛన్ పంపిణీ, డ్వాక్రా యానిమేటర్లతో మాట్లాడారు. డ్వాక్రా స్వయం సహాయ సంఘాలకు మంజూరు చేసిన నిధుల సద్వినియోగంపై డ్వాక్రా సంఘాల మహిళలతో చర్చించారు. ఈ పథకాలను సంబంధించిన పలు రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కొలిక్కి రాని బంగారం చోరీ కేసు

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ సతీష్ కుమార్



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్ కుమార్

మంగళగిరి: బంగారం చోరీ కేసు పోలీసు అధికారులకు అంతుచిక్కడం లేదు. రూ.5 కోట్ల అని చెబుతుండడంతో అధికారులు లోతైన విచారణ చేపట్టారు. సోమవారం ఎస్పీ సతీష్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి అధికారులకు దర్యాప్తుపై పలు సూచనలు చేశారు. ఏఎస్పీ రవి కుమార్ నేతృత్వంలో ఫిర్యాదుదారుడు దివి నాగరాజుతో పాటు దుకాణంలో పని చేస్తున్న ఐదుగురు యువకులను రూరల్ సర్కిల్ కార్యాలయంలో విచారిస్తున్నారు. పట్టణానికి చెందిన దివి రాము, విజయవాడలో డీవీఆర్ జ్యూయలరీ దుకాణం నిర్వహిస్తుంటాడు. అందులో మేనేజర్‌గా పనిచేసే దివి నాగరాజు ఈ నెల 15వ తేదీ రాత్రి సుమారు ఐదు కిలోల వివిధ రకాల బంగారు ఆభరణాలను సంచిలో పెట్టుకుని స్కూటీపై వస్తుండగా ఆత్మకూరు బైపాస్‌లోని అండర్ పాస్ వద్ద గుర్తు తెలియని ఇద్దరు యువకులు అడ్డుకుని సంచిని లాక్కుని పారిపోయారని మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. డీఎస్పీ మురళీకృష్ణ నేతృత్వంలో చోరీ జరిగిన తీరుపై ట్రయల్ రన్ నిర్వహించారు. సంచి లాక్కుని వెళ్లిన తీరుపై నిర్వహించిన ట్రయల్ రన్‌లో లాగినా సంచి చేతికి వచ్చే అవకాశం లేదని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. విజయవాడలో ఆభరణాలతో బయల్దేరిన నాగరాజు ఏ మార్గంలో మంగళగిరి చేరుకున్నారనే అంశంపై సీసీ కెమెరాలను పరిశీలించారు. విజయవాడ దుకాణం వద్ద నుంచి కెమెరాలను పరిశీలించిన పోలీసులు 40 ఏళ్ల లోపు వయస్సు ఉన్న ఇద్దరు వ్యక్తులు నాగరాజును వెంబడించినట్లు గుర్తించి వారిని అనుమానిస్తున్న పోలీసులు వారి కోసం గాలిస్తున్నారు. దీంతో అసలు చోరీ జరిగిందా లేదా అనే అంశంతో పాటు చోరీ జరిగిన రోజున దుకాణంలో ఐదు కేజీల బంగార ఆభరణాలున్నాయా.. ఆభరణాలు తయారు చేయించుకున్న దుకాణదారులు, కస్టమర్లు ఎవరు అనే కోణంలోను దర్యాప్తు ప్రారంభించినట్లు అధికారులు చెబుతున్నారు.

విజ్ఞాన్‌లో డ్రోన్ టెక్నాలజీ సెంటర్ ప్రారంభం



డ్రోన్ టెక్నాలజీ సెంటర్ ను ప్రారంభిస్తున్న విద్యాసాగర్

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో డ్రోన్ టెక్నాలజీ సెంటర్(సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ అటానమస్ సిస్టమ్స్)ను హైదరాబాద్‌లోని ఎస్ఈసీ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డి.విద్యాసాగర్ సోమవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ సెంటర్ వలన విద్యార్థులకు డ్రోన్ డిజైన్, ప్రోగ్రామింగ్, డ్రోన్ల వినియోగంపై శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. టెక్నాలజీలో హ్యాండ్స్- ఆ అనుభవం కల్పించేందుకు ల్యాబ్ సౌకర్యాలు, విద్యాపరమైన కోర్సులు, వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డ్రోన్ టెక్నాలజీ, ఆటోనమస్ నావిగేషన్, రిమోట్ సెన్సింగ్‌పై ప్రత్యేక కోర్సులను ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. విద్యార్థులకు పరిశ్రమ నిపుణులతో వర్క్‌షాప్‌లు, సెమినార్లు, అతిథి ఉపన్యాస కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులకు కొత్త డ్రోన్ ఆధారిత స్టార్టప్‌లను ప్రారంభించేందుకు మద్దతు అందిస్తామని వివరించారు. పరిశ్రమలతో కలిసి కొత్త డ్రోన్ సొల్యూషన్ల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. డ్రోన్స్‌టెక్నాలజీలో అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలతో సహకారానికి తోడ్పాటుపడతామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. డ్రోన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామింగ్‌పై పోటీలు నిర్వహించడం, డ్రోన్‌పై పై కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించే కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ ఈ డ్రోన్ టెక్నాలజీ సెంటర్‌ను హైదరాబాద్‌లోని ఎస్ఈసీ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు విజ్ఞాన్ యూనివర్సిటీల సంయుక్త ఆర్థిక సౌజన్యంతో ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి శ్రావణ్ బాబు

తాడికొండ: చిన్నారులకు వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అందించే టీకాలు సకాలంలో వేయించేలా సిబ్బంది చొరవ తీసుకోవాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్ బాబు అన్నారు. సోమవారం తుళ్లూరు పీహెచ్‌సీని సందర్శించిన ఆయన వైద్య బృందంతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్నారులకు బిడ్డ పుట్టిన దగ్గర నుంచి ఏఏ టీకాలు ఏ సమయంలో వేయించాలి అనే విషయంపై స్పష్టంగా అవగాహన కల్పించాలని కోరారు. టీకాలకు సంబంధించిన సమాచారాన్ని యు విన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసే విధానాన్ని వివరించారు. గ్రామాల్లో సీడీఎస్‌సీ సర్వే చేసి ప్రతి గ్రామంలోని కుటుంబాలకు ఐడీ నంబర్లు ఇచ్చేలా చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.శ్రీనివాస్, వసుంధర, శివపార్వతీ, సీహెచ్ఓ వెంకట రమణ, ఎంఎస్ రాణి, పర్యవేక్షకులు సుధాకర్, డీఎస్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ కరీమ్ పాల్గొన్నారు.

బైక్ దొంగల అరెస్ట్

నగరంపాలెం: మారు తాళాలతో అర్ధరాత్రి సమయాల్లో మోటారు సైకిళ్లను దొంగలించే నలుగురిని వేర్వేరు కేసుల్లో అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ వెల్లడించారు. సుమారు రూ.11 లక్షల ఖరీదు చేసే 22 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ట్రైనీ ఐపీఎస్ దీక్ష, జిల్లా ఏఎస్పీ కె.సుప్రజ (క్రైం)తో కలసి జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కేసుల వివరాలను జిల్లా ఎస్పీ వెల్లడించారు. పెదపలకలూరు రత్నగిరికాలనీ వాసి వెలివోలు వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేశ్ బీటెక్ చదివాడు. గతంలో హౌసింగ్ కార్పొరేషన్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వర్తించాడు. సుమారు 25 దొంగతనాలు చేయగా, 22 మోటారుసైకిళ్లు, మూడు సంచులు దొంగలించాడు. అతడిపై నలభై కేసులు ఉన్నాయని అన్నారు. వెంకటేశ్‌కు ముప్పాళ్ల మండలం లంకెలకూరపాడు గ్రామస్తుడు వ్యవసాయ పనులు చేసే ఎం.సీతారెడ్డి రెండేళ్ల క్రితం పరిచయమయ్యాడు. సీతారెడ్డి ద్వారా ఓఎల్ఎక్స్‌లోని ఏడు బైక్‌లను విక్రయించాడు. తద్వారా వచ్చిన సొమ్ములో కొంత నగదు కమిషన్ రూపంలో సీతారెడ్డికి వెంకటేశ్ ఇచ్చేవాడని దర్యాప్తులో గుర్తించారు. వీరిద్దరి వద్ద రూ.6 లక్షల ఖరీదు చేసే 12 మోటారుసైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. తెనాలి రూరల్ మండలం సంగంజాగర్లమూడి గ్రామస్తుడు ఎండీ అబ్దుల్‌రషీద్ కూలీ పనులకు వెళ్లేవాడు. ఆటోడ్రైవర్లతో కలిసి మద్యం, గంజాయికి అలవాటుపడ్డాడు. ఈ క్రమంలో తెనాలికి చెందిన పాత నేరస్తుడు భరత్(ప్రస్తుతం నరసరావుపేట జైల్లో ఉన్నాడు)తో పరిచయం ఉంది. భరత్ వద్ద చోరీలు చేయడంలో శిక్షణ పొందాడు. అనేకసార్లు చోరీలు చేసి జైలుకెళ్లాడు. అతడిపై పలు పీఎస్‌ల్లో 26 దొంగతనం కేసులున్నాయి. గతంలో గుంటూరు జిల్లా కారాగారంలో పరిచయమైన గుంటూరు రూరల్ మండలం దాసరిపాలెం ప్లాట్స్‌లో ఉండే చల్లా గోపితో కలిసి నేరాలకు పాల్పడ్డాడు. అర్ధరాత్రుళ్లు సుమారు రెండు గంటల సమయంలో బైక్‌ల హ్యాండిల్స్ విరగొట్టడం లేదా మారు తాళాలతో చోరీలకు చేసేవాడు. నంబరు ప్లేట్‌లు తొలగించి గ్రామాల్లో వారికి తక్కువ ధరకు విక్రయించడం లేదా తనఖా పెట్టేవాడని గుర్తించారు. చల్లా గోపీ 2020లో మిత్రుడైన శారదాకాలనీకి చెందిన మిట్టు, మిత్రులతో కలసి దోపిడీకి పాల్పడి, జైలుకెళ్లి వచ్చాడు. అతడిపై 11 కేసులున్నాయి. వీరిద్దరి వద్ద రూ.5 లక్షల ఖరీదు చేసే పది మోటారుసైకిళ్లను సీజ్ చేశారు. ఈ నలుగుర్ని గుజ్జనగుండ్ల కూడలి, నారాకోడూరులో పట్టుకుని అరెస్ట్ చేశామని అన్నారు. జిల్లా ఏఎస్పీ కె.సుప్రజ (క్రైం), సీఐలు ఎండీ.అల్తాఫ్‌హుస్సేన్, బి.శ్రీనివాసరావు, జె.అనురాధ, చేబ్రోలు పీఎస్ ఎస్ఐ డి.వెంకటకృష్ణ, పలువురి సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించి, రివార్డులు అందించారు.

అద్భుతమైనది హనుమత్ వైభవం

పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి



స్వామిజీ ఆశీస్సులు తీసుకుంటున్న భక్తులు

తెనాలి: హనుమత్ వైభవం చాలా గొప్పదని, వాస్తవానికి భవిష్యత్ బ్రహ్మ ఆంజనేయస్వామిగా పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి(బాలస్వామి) అన్నారు. స్థానిక షరాఫ్‌బజారులోని శ్రీసువర్చలా సమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామి దేవాలయాన్ని బాలస్వామి సోమవారం దర్శించారు. స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. తన బాల్యంలో పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంతో అనుబంధాన్ని గుర్తుచేశారు. అనంతరం భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు. హనుమంతుడి ధ్వజం ఎక్కడైతే ఉంటుందో అక్కడ జయాలు ఉంటాయని చెప్పారు. హనుమాన్ చాలీసా కూడా జయహనుమతోనే ప్రారంభమవుతుందని గుర్తుచేశారు. మాఘమాసంతో సహా ఏ మాసంలో ఏరోజు ఏమేం చేయాలో? ధర్మ ఆచరణ విధివిధానాలను పెద్దలు చెప్పారనీ, ప్రజలు శాస్త్రప్రకారం ధర్మాన్ని పాటిస్తూ, భగవంతుడిని ఆరాధిస్తూ తమ జీవనవిధానాన్ని ఆచరించాలని సూచించారు. బాలస్వామీజీకి ఆలయ ఈఓ అవుతు శ్రీనివాసరెడ్డి, హరిప్రసాద్, ప్రధాన అర్చకుడు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, ఆర్‌వీ కిరణ్‌కుమార్ స్వాగతం పలికారు. స్వామీజీతో సాలిగ్రామ మఠం కార్యదర్శి రావూరి సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య, కోశాధికారి గోపు రామకృష్ణ, సభ్యులు రాజేశ్వరరావు, ప్రభరాణి, వరలక్ష్మి, ప్రమీల పాల్గొన్నారు.

ఉత్తమ ప్రదర్శన ఇంద్రప్రస్థం



ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైన ఇంద్రప్రస్థంలోని దృశ్యం

నరసరావుపేట ఈస్ట్: నరసరావుపేట రంగస్థలి 45వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, రంగస్థలి సంయుక్త ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహించిన 24వ జాతీయస్థాయి ఆహ్వాన తెలుగు నాటిక పోటీలు గుంటూరు అభినయ ఆర్ట్స్ వారి ఇంద్రప్రస్థం నాటిక ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది. రెండో ఉత్తమ ప్రదర్శన బహుమతి గుంటూరు అమరావతి ఆర్ట్స్ వారి చిగురు మేఘం నాటికకు లభించింది. ఉత్తమ నటుడుగా హైదరాబాద్ కళాంజలి వారి అన్నదాత నాటికలో అంకమ్మతాత పాత్రదారి చెంచు పున్నయ్య, ఉత్తమ నటిగా కాకినాడ జి.వి.కె.క్రియేషన్స్ వారి తితిక్ష నాటికలో భారతి పాత్రదారి ఎస్.జ్యోతిరాణి, ఉత్తమ విలన్‌గా వెలగలేరు ఆర్ట్స్ థియేటర్ వారి రాత నాటికలో అజయ్ పాత్రదారి పవన్‌కళ్యాణ్ ఎంపికయ్యారు. ఉత్తమ దర్శకుడు బహుమతి ఇంద్రప్రస్థం దర్శకుడు ఎస్.రవీంద్రరెడ్డి కైవశం చేసుకున్నారు. ఉత్తమ రచనగా రాత నాటిక రచయిత పోలదాసు శ్రీనివాసరావు బహుమతులు అందుకున్నారు. అలాగే క్యారెక్టర్ నటుడిగా చిగురు మేఘం నాటికలో చిన్నయ్య పాత్రదారి కావూరి సత్యనారాయణ, హాస్య నటునిగా పక్కింటి మొగుడు నాటికలో సీతాపతి పాత్రదారి యు.వి.శేషయ్య, ఉత్తమ బాలనటిగా రాత నాటికలో స్వప్నిక పాత్రదారి సురభి వాగ్దేవి, ఉత్తమ మేకప్ శ్రీఉమా ఆర్ట్ కికొకని (తితిక్ష), రంగాలంకరణ టి. బాబురావు (తితిక్ష), ఉత్తమ సంగీతం కె.వి.రమణ (పక్కింటి మొగుడు), ప్రత్యేక జ్యూరీ బహుమతి రాత నాటిక బహుమతులు సాధించారు. ఈ ఏడాది రంగస్థలి ప్రతిభా పురస్కారాన్ని నాటక రచయిత, నటుడు, దర్శకుడు చలసాని కృష్ణప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమాలను రంగస్థలి అధ్యక్షుడు షేక్‌మహబూబ్‌సుభానీ, గౌరవాధ్యక్షుడు కె.వెంకటరావు, ప్రధాన కార్యదర్శి ఎస్.రామచంద్రబోస్, కోశాధికారి కనపర్తి సూరిబాబు, ఏఏ మధుకుమార్, పి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షించారు.

క్వారీ తిరునాళ్లకు సకల సౌకర్యాలు

తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహా



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

చేబ్రోలు: మహారాత్రి సందర్భంగా క్వారీ తిరునాళ్లకు అన్ని సౌకర్యాలు కల్పించాలని తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహా ఆదేశించారు. వడ్లమూడి క్వారీ తిరునాళ్ల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ అధికారుల కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. భక్తుల అభిషేకాలు, దర్శనాలు, తాగునీటి వసతి, పారిశుద్ధ్య నిర్వహణ, ఎలక్ట్రికల్ ప్రభల బరువు, సామర్థ్యం, ఎత్తు, ట్రాఫిక్ నియంత్రణ, వెహికల్స్ పార్కింగ్ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ శ్రీ బాల కోటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అధికారులను శాఖల వారీగా విడిది స్టాల్స్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆలయ ఈఓ రామకోటేశ్వరరావు మాట్లాడుతూ మూడు రోజులు పాటు వైభవంగా మహాశివరాత్రి వేడుకలు జరుగుతాయని, ఈ వేడుకల్లో మొదటిరోజు పశువుల ప్రదక్షిణలు ఉంటాయని, రెండో రోజు వాహనాల ప్రదక్షిణలు పూజలు ఉంటాయని, మూడవరోజు ఈనెల 26వ భక్తుల అభిషేకాలు మహాశివరాత్రి వేడుకలు ఉంటాయని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ కె.శ్రీనివాసశర్మ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ.ఉమాదేవి, ఈఓపీఆర్డీ టి.ఉషారాణి, ఆలయ ఈఓ రామకోటేశ్వరరావు, తిరునాళ్ల కమిటీ చైర్మన్ జి.శ్రీకాంత్, 52 శాఖల అధికారులు పాల్గొన్నారు.